

# కథా కౌముది

## ఒదిగిన మహా సముద్రం - ఆకెళ్ళ శివప్రసాద్

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో ఎంపికైన ఉత్తమ కథ)

జీవితం మరీ యాంత్రికమైపోయిన భావన కలిగినప్పుడు మనసు సేద తీర్చడం కోసం జ్ఞాపకాలని అందించిన వ్యక్తులిరువురిని చూడాలనుకోవడం సహజమైన విషయం!

యాంత్రికమైన భావనే కాదు గతకొన్నేళ్ళుగా యంత్రంలా అయిపోయిన నేను మనసు మాటవిని 'సిద్ధాంతం' బయలుదేరాను.

'సిద్ధాంతం' నా బాల్యానికి సాక్షిగా నిలిచిన ఊరు. ఆ ఊర్లోనే ఉన్నాడు నా చిన్ననాటి స్నేహితుడు దీక్షితులు. నిజాయితీగా చెప్పాలంటే నా కన్నా తెలివైనవాడు, జీవితంలో తనకేం కావాలో స్పష్టంగా తెలిసినవాడు దీక్షితులు.

మా నాన్నగారికి తరచు బదిలీ అవుతుండడం వల్ల మా తాతగారి ఊళ్ళోనే ఆరోతరగతి నుండి చదువుకున్నాను. ఆరోతరగతిలో చేరినప్పుడు నా బెంచీలో నా పక్కనే కూచునేవాడు దీక్షితులు. బల్ల దగ్గర మొదలైన స్నేహం ఆ సాయంత్రానికే బల్లకట్టు మీద ప్రయాణం వరకూ వెళ్ళింది. ఆ సాయంత్రం గోదావరి లంకలో ఆడుకుని, తిరిగి వస్తున్నప్పుడు బల్ల కట్టు ఎక్కాం.

మా ఇంటి దగ్గరగా దీక్షితులు ఇల్లు ఉండడం వల్ల, ఎప్పుడు ఒకరిని వదిలి పెట్టి మరొకరు ఉండక పోవడం వల్ల ఆత్మీయులమయిపోయాము.

అన్ని విషయాల్లో దీక్షితులు అంటే ఇష్టంగా ఉన్నా, చదువు విషయంలో మాత్రం అసూయగా ఉండేది.

ప్రతి పరీక్షలోనూ నాకన్నా కనీసం ఒక్క మార్కైనా ఎక్కువ వచ్చేది.

ఏడో తరగతి పరీక్షలో రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించాడు దీక్షితులు. మా బడిలో ప్రత్యేకంగా 'సన్మాన కార్యక్రమం' ఏర్పాటు చేశారు.

సన్మాన కార్యక్రమంలో మాట్లాడిన మా లెక్కల మాష్టారు, ప్రిన్సిపాల్ దీక్షితులు తప్పకుండా ఇంజనీరో, డాక్టరో, శాస్త్రవేత్తో అవుతాడని గొప్పగా మాట్లాడారు. చిత్రంగా అందరికన్నా చివరగా మాట్లాడుతూ దీక్షితులు -

"నాకు తెలుగు భాషంటే ఎక్కువ ఇష్టం.. అమ్మంటే ఎంత ఇష్టమో అమ్మ భాషంటే అంత ఇష్టం.. ఆ భాషలోని ప్రతి అక్షరంలో అనంత సత్యాలు కనిపిస్తాయి... 'అ'లో అమ్మ, 'ఆ'లో ఆత్మీయత, ఇలో ఇల, ఈలో ఈశ్వర ప్రేమ.. ఇలా ప్రతి అక్షరంలో కామధేనువు, కల్పవృక్షమూ కనిపిస్తాయి.... 'నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు, తళుకు బెళుకు రాళ్ళు వట్టడేల' అన్న వేమన పద్యం

వల్లె వేసుకున్నా, తన సంతోషమె స్వర్గము అన్న సుమతి శతకాన్ని చదువుకున్నా, గంగ ఉదకము తెచ్చి లింగ పూజలు చేసే కృష్ణశాస్త్రి సాహిత్యమన్నా, గులాబీ బాల మనసు తెలుసుకున్న కరుణశ్రీగారి మాటన్న, దోసిళ్ళతో అమృతం తాగిన తిలక్ కవిత్వమన్నా నాకు ప్రాణం.. అందుకే అపురూపంగా నిలిచిన తెలుగులో సరిగంగ స్నానాలు చేయాలని, సాహిత్యంలో మమేకమై సాగాలని నా ఆశ.... ఆశయం.. మందార మకరందమాధుర్యాలని గ్రోలాలని వాంఛ.. నాకు నడతని, నడవడికని, సంస్కృతిని, సంప్రదాయాన్ని, ఆటని పాటని నేర్పిన భాషని నన్ను నేను అర్ధం చేసుకోవడానికి ఉపయోగించుకోవాలి... రమణ మహర్షి గారి బోధనల సారాంశంలా 'నేనెవరినో' తెలుసుకునే ప్రయత్నం చేయాలి... అందుకే పద్యాలుగా, కవితలుగా, కథలుగా, నాటకాలుగా, నవలలుగా అనేక బాహువులతో విస్తరించిన భాషా విశ్వరూపాన్ని సాక్షాత్కరించుకునే భగీరథ ప్రయత్నం చేస్తున్నాను.. అఖండమైన గంగలాంటి భాషని జాహ్నమహర్షి ఆపోసన పట్టినట్టు పట్టలేక పోయినా? ఆత్మానందాన్ని పొందే ప్రయత్నంలో ఆధారం చేసుకోవాలనుకుంటున్నాను.. ఒక్కోసారి తీరం చేరడంలో కన్నా ప్రవాహంలో సాగడంలోనే ఆనందం ఎక్కువగా ఉంటుంది..." అంటూ అనర్గళంగా మాట్లాడుతుంటే, అంతా మంత్ర ముగ్ధుల్లా ఉండిపోయాం. ఏడోతరగతి చదివిన అబ్బాయి అంత స్పష్టంగా భావి జీవితం గురించి, జీవితంలో ఎంచుకున్న మార్గం గురించి చెప్పడం ఆశ్చర్యంగా ఉంది.

దీక్షితులు మాట్లాడ్డం పూర్తయిన వెంటనే లెక్కల మాష్టారు వాడి దగ్గరకు వచ్చి -

"... ఇదేమిట్రా ఇంత తెలివైనవాడివి తెలుగు చదవడమేమిటి?" అని అడిగారు.

"తెలివైన వాళ్ళు తెలుగు చదవకూడదా? మీరూ చిత్రంగా మాట్లాడతారే.... మన భాషకి మనకు విలువ ఇవ్వకపోతే ఎలా?... ఈ తెలివి తేటలు మాతృభాష ఇచ్చినవే.. మీరే చాలాసార్లు చెప్పారు. మాతృ భాషలో అర్ధం చేసుకుంటే ఎప్పటికి గుర్తు ఉంటుందని.." అన్నాడు.

ఆ తరువాత హితులు, సన్నిహితులు చాలా రకాలుగా దీక్షితులు ఎంచుకున్న 'దిశ' మార్చే ప్రయత్నం చేస్తే -

"బ్రహ్మ మొక్కటే పరబ్రహ్మమొక్కటే' అన్న అన్నమయ్య మాట అచ్చ తెనుగు మాట ఎందులోనూ కనిపించదు.." అనేశాడు. అనడమే కాదు 'ఇంటర్'లో నే దారి మార్చుకున్నాడు.

ఈ పరిణామం వల్ల తెలీని ఆనందం నాకు కలిగింది. ఇక ఈ ఊరిలో నాకు పోటీ ఉండరు. దీక్షితులు పోటీ ఉండడు కనుక నా ప్రాధాన్యత పెరుగుతుంది.

అమలాపురం కాలేజీలో ఇంటర్ పూర్తిచేసి, వైజాగ్ ఆంధ్రా యూనివర్శిటీలో ఇంజనీరింగ్ పూర్తి చేసి, క్యాంపస్ సెలక్షన్ రావడము బెంగుళూరులో ఉద్యోగంలోచేరి, అక్కడి నుంచి ఉద్యోగ రీత్యా అమెరికా వెళ్ళిపోయాను. దాదాపుగా పదేళ్ళ పై చిలుకు కాలం ఫోన్లలో మాట్లాడుకోవడం తప్ప ప్రత్యేకంగా కలుసుకోలేదు.

ఈ పదేళ్ళ కాలంలో దీక్షితులు తెలుగు పి.జీ పూర్తి చేసి, తెలుగు టీచర్గా ఉద్యోగంలో చేరాడు. తను ఇష్టపడిన చంపక మాల, ఉత్పలమాల, ఆటవెలది తేటగీతి పద్యాలు, కవితలు, కథలు రాస్తున్నాడు. నా పెళ్ళి సందర్భంలో 'పంచరత్నాలు' రాసి కూడా పంపాడు. నా పెళ్ళి తరువాతే దీక్షితులు పెళ్ళి జరిగింది.

ఉద్యోగ వత్తిడి వల్ల వాడి పెళ్ళికి వెళ్ళలేకపోయాను. నిజానికి దీక్షితులు మేనమామ కూతురు 'అపురూప'నిచ్చి పెళ్ళిచేస్తారని చిన్నప్పటినుండి అనుకునేవాళ్ళు. కాకపోతే తెలుగు మేష్టారుకిచ్చి పిల్లని పెళ్ళి చేయడం ఇష్టంలేక కాకినాడలో ఇంజినీర్గా పనిచేస్తున్న అబ్బాయితో ఆమె పెళ్ళి చేశారు. అప్పుడు దీక్షితులు స్థితప్రజ్ఞుడిలా -

"....మనని ఇష్టపడేవాళ్ళు ఎక్కడో ఉంటారు... అయినా తెలుగు భాషతో సంసారం ఉండనే ఉందిగా.." అనేవాడు. మరో విషయమేమిటంటే -

దీక్షితులకి కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చినా వెళ్ళలేదు –

"బీజాలు గట్టి ఉండాలంటే చిన్నప్పటినుండీ భాష పట్ల ఇష్టాన్ని కలిగించాలి.... అంచేత బడిలోనే చదువు చెబుతా..." అన్నాడు.

దీక్షితులు నిర్ణయం మార్చడం కష్టం. అంచేత ఎవరూ ఏమీ మాట్లాడలేదు ఉద్యోగం విషయం.

ఆ తరువాత, అంతర్వేదిలో ఉంటున్న సంగీతం మేష్టారు అమ్మాయి కౌసల్యని పెళ్ళిచేసుకున్నాడు.

దీక్షితులకి ఇద్దరు పిల్లలు. కవలలు. సుకృతి, సుస్వర. మానవ సంబంధాలని మహత్తరంగా మార్చివేసిన కమ్యూనికేషన్ సౌకర్యాలవల్ల, ఇ – మెయిల్‌లో గ్రీటింగ్స్, ఫోన్‌లో శుభాకాంక్షలు చెప్పేశాను – అన్ని సందర్భాలలో. కాలగతిలో జీవన శృతిలో మార్పులు సహజం. ఆ మార్పే మనసులో పేరుకుపోయిన 'ఖాళీని' పూరించే ప్రయత్నంలో ఈ ఊరుకి తీసుకువచ్చింది.

తాతయ్య పోయాక మా బంధువులు అమలాపురం వెళ్ళిపోయారు. సిద్ధాంతంలో ఉన్నది స్నేహితులే!

సిద్ధాంతం బ్రిడ్జి దగ్గర కారు దిగి, డ్రైవర్‌కి ఊళ్ళో ఉన్న వేణు గోపాలస్వామి గుడి దగ్గరకి రమ్మని చెప్పి నడక సాగించాను.

కాలువ గట్ల మధ్య దోబూచులాడిన బాల్యపు గురుతులు వెతుక్కుంటూ నడుస్తున్నాను.

ఊళ్ళోకి అడుగు పెట్టేసరికి –

"మీరూ?! " అని గుర్తుపట్టారు ఒకరు. ... అలా అలా.. పలకరింపుల పర్వం మొదలైంది... ఆ పదేళ్ళ కాలంలో కాలం చేసిన తాతయ్యని, అమ్మమ్మని గుర్తుతెచ్చుకునారు.

సరిగ్గా లెక్కల మేష్టారు ఇంటిదగ్గరకె వచ్చాను. ఆయన ఈ మధ్యే రిటైర్ అయ్యారు. ఆయన ఇంటి పక్కనే దీక్షితులు ఇల్లు.

కుశల ప్రశ్నలు అయ్యాక "మీ స్నేహితుడు వచ్చాక మమ్మల్ని పట్టించుకోవు... ఈ పూట ఇక్కడే భోజనం చేయాలి.." అని పట్టు బట్టారు. దీక్షితులు ఆచంట బడిలో టీచర్‌గా చేస్తున్నాట్ట. ఫోన్ చేస్తామంటే వద్దని చెప్పాను. నన్ను చూసి వాడి ఆశ్చర్యపోవాలి. అందుకే వస్తున్నట్టు తెలియచేయలేదు.

లెక్కల మేష్టారు ఇంట్లో స్నానం పూర్తి చేసేసరికి ఆ ఊళ్ళో తెలుసున్న వాళ్ళందరూ వచ్చారు. దీక్షితులు, భార్యాపిల్లలు ఊరు వెళ్ళినట్టు తెలిసింది.

భోజనం పూర్తయ్యేసరికి, ముగ్గురు నలుగురు పరిచయస్తులు వాళ్ళ పిల్లలని నా దగ్గరకి తీసుకు వచ్చి, నన్ను ఆదర్శంగా తీసుకుని ప్రయోజకులు కావాలని చెప్పి, అవకాశాలు ఉంటే కొందరికి ఉద్యోగాలు ఇప్పించమని అప్లికేషన్స్ ఇచ్చారు.

నేనేదో అందనంత ఎత్తులో ఉన్నట్టూ, వాళ్ళు అతి సామాన్యంగా ఉన్నట్టు క్షణం అహం కలిగింది. అప్లికేషన్స్ తీసుకుని – "చూస్తాను" అన్నాను ముక్తసరిగా –

ఆమాటకే వాళ్ళు ఆనంద పడిపోతూ, వాళ్ళ కంప్యూటర్ కోర్సుల సర్టిఫికెట్లు చూపెట్టారు.

"చూస్తానంటే చేస్తాడులే.. పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు విసిగించకండి..." అకారణంగా వాళ్ళ మీద అరిచారు మాష్టారు. నేను విశ్రాంతి తీసుకుంటానని చెప్పి వాళ్ళని పంపేశారు. అంతా వెళ్ళిపోయాక " మా మనవడు హైదరాబాదులో కంప్యూటర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు... హఠాత్తుగాఏమైందో తెలియదు ఉద్యోగంలోంచి తీసేశారు... ఆ బాధతో వాడు నిద్రమాత్రలు మింగాడు.. అతి కష్టం మీద బ్రతికించుకోగలిగాము.... వీలుంటే వాడికి ఉద్యోగం చూస్తావా?" అని అడిగారు!

అందరికీ ఇచ్చినట్టే ఆయనకి 'చూస్తానని' మాట ఇచ్చాను అప్లికేషన్ తీసుకుని!

సాయంత్రం ఆరయింది. దీక్షితులు అప్పటికి రాకపోయే సరికి –

"బడి నుండి తిన్నగా గోదావరి ఒడ్డుకి వెళ్ళి వుంటాడు.. అక్కడ పిల్లలకి తెలుగు చెప్తుంటాడు...." అన్నాడు మేష్టారు. మెల్లగా గోదావరి వైపునడక సాగించాను. దారిలో ఒకరిద్దరి పలకరింత.

"ఒరులేయవియొనరించిన

నరవర! యుప్రియము దన మనంబున కగుదా

నొరులకు నవిసేయకునికి

పేరాయణము పరమ ధర్మ పథము కెల్లన్"

ఇతరులు చేసే పనులేవవి మన మనసుల్ని నొప్పిస్తాయో, అలాంటి పనులుమనం ఇతరుల పట్ల చేయక పోవడమే అన్ని ధర్మాలకెల్ల గొప్ప ధర్మమని మహాభారత పద్యం అద్భుతంగా ఆలపిస్తూ, వివరిస్తున్నాడు దీక్షితులు.

ఇన్నేళ్ళు గడిచినా చెదరని ప్రశాంతత, ఆత్మీయత మొహంలో కనిపిస్తున్నాయి.

నన్ను చూసి ఆశ్చరంగా ఆనందంగా -

"ఏమిత్రా ఏ రకమైన సమాచారం కాకుండా వచ్చావు!?.." అన్నాడు పిల్లల్ని పంపించేస్తూ -

ఆ తరువాత, ఆ గోదారి ఒడ్డున పసివాళ్ళమయిపోయాం! ఎన్నో కబుర్లు... ముచ్చట్లు.... లేత చీకట్లు.... దూరంగా బ్రిడ్జి మీద వాహనాలు బొమ్మలు కదులుతున్నట్టుగా ఉంది..

గోదావరిలో ఓ తెరచాప పడవ అలౌకిక ఆనందాన్ని పొందుతున్న యోగిపుంగవుడిలా ఉంది!

మా కబుర్లతో మేము -

నక్షత్రాల కబుర్లలో అవి!

ఎప్పటికో ఇల్లు చేరుకున్నాం!

దీక్షితులే స్వయంగా వంట చేశాడు.

భోజనాలు అయ్యాక పెరట్లో పక్కలు వేశాడు.

మర్నాడు ఉదయం బయలు దేరితే గాని వైజాగ్‌లో ఎటెండ్ కావలసిన సెమినార్‌కి ఎటెండ్ కాలేను. సూట్‌కేసు సర్దుతుంటే, ఊళ్ళో వాళ్ళు ఇచ్చిన అప్లికేషన్ చూశాడు దీక్షితులు -

"...ఏమిత్రా.. ఊళ్ళో వాళ్ళందర్ని కంప్యూటర్లగా మార్చేద్దామనుకుంటున్నావా?" నవ్వుతూ అడిగాడు. అప్పటిదాకా గర్వంగా ఉన్న నేను, దీక్షితులు అడిగిన దానికి గిల్టీగా ఫీలయి -

"...చలి చెలమ మేలు కదా కులనిధి యంబోధికన్న..." ఎప్పటి పద్యమో గుర్తుతెచ్చుకుంటూ అన్నాను. అర్ధంకానట్టుగా చూశాడు దీక్షితులు.

"..దాహం తీర్చేది మహా సముద్రం కాదు... చెలమే... ఇప్పుడు కంప్యూటర్ రంగంలో పరిస్థితులు బాగోలేవు... ఉన్నవాళ్ళకే ఉద్యోగాలు పోతున్నాయి. ఆర్థిక మాంద్యం ప్రపంచాన్ని కుదిపేస్తోంది. కాదనలేక అప్లికేషన్స్ తీసుకున్నాను. ఏమాత్రం సాయం చేయగలనో తెలియదు. అనవసరంగా ఆశలు కల్పించానేమో. కంప్యూటర్‌తోటే పనిచేస్తున్నాను గానీ ఆత్మవిశ్వాసంతో, సంతృప్తితో చేయలేక పోతున్నాను.."

గుండెలో కొద్దిగా భారం తీరి, అహం పూర్తిగా కరిగి, ముసుగులోంచి బైటపడినట్టుగా అనిపించింది - నా 'కన్ఫెషన్' కినాకు!

దీక్షితులు ప్రశాంతంగా నవ్వాడు -

మహాసముద్రమంత అసూయ కలిగింది వాడిమీద, వాడిని అలా మార్చిన తెలుగు మీదా!!!